

పెండింగ్ వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లావ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, ప్రొద్దుటూరులో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, జిల్లా కోశాధికారి గోపి ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి విజయ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోయినా మున్సిపల్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ వేతనాలు రాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. జమ్మలమడుగు లాంటి ప్రాంతంలో ఏడాదిగా ఆయిల్, సోప్స్, బట్టలు, స్లిప్పర్స్, కుట్టుకూలి ఇవ్వకపోవడం మరింత బాధాకరమని తెలిపారు. జిల్లాలో మున్సిపాలిటీల్లో వర్కర్ల పరిస్థితి వర్ణనాతీతం అని పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్, అడిషనల్, కోవిడ్, కార్మికులు, ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

విద్య, ఉపాధ్యాయ రంగాల
సమస్యలపై నిరంతర పోరాటం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. మంగళవారం కడప యుటిఎఫ్ భవన్‌లో ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు గాజులపల్లి గోపీనాథ్ అధ్యక్షతన ఒంటిమిట్ట మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ ఒంటిమిట్ట మండలం నూతన కమిటీని ఎన్నికల అధికారి సి.వి.రమణ ఎన్నికల పరిశీలకులు నరసింహారావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా ఎస్.రవూఫ్‌బాష, అధ్యక్షులుగా యు. భాగ్యలక్ష్మి, సహాధ్యక్షులుగా ఎస్.విశ్వనాథ్, టిడిపి ప్రత్యూష, ప్రధాన కార్యదర్శిగా మాలే బాబు, ట్రెజరర్‌గా బ్రహ్మయ్య, జిల్లా కౌన్సిలర్లుగా మాలే బాబు, యు.భాగ్యలక్ష్మి, జి.గోపీనాథ్, వై. సురేష్ కుమార్, బి.వెంకట సుబ్బరాయుడు,పి. మహబూబ్ ఖాన్, గ్రేస్ ప్రమీల, సూర్య ప్రకాష్, తిరుపాలయ్య, మస్తానయ్య. మండల కార్యదర్శులుగా పి.రెడ్డయ్య,ఆగస్టీన్ బాబు, షీలా కుమారి,షాజ జమీర్, ఖదీర్, ప్రభాకర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా దాసరి ప్రసన్నకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

ఎస్‌జిటి ఖాళీలను భర్తీ చేయాలి

అకడమిక్ ఇన్‌స్ట్రక్చర్ల ద్వారా ఉమ్మడి జిల్లాలోని ఎస్‌జిటి ఖాళీలనన్నింటిని భర్తీ చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ డాక్టర్ శంషుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ బదిలీల చట్టం తీసుకువచ్చి బదిలీలు నిర్వహించి ఐదు నెలల పూర్తయినప్పటికీ రిలీవర్ లేని కారణంగా పాత పాఠశాలల్లోనే కొనసాగించడం వల్ల బదిలీ పొందిన ఉపాధ్యాయులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, ప్రకాష్ బాబు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

చారిత్రక వైభవాన్ని చాటేలా
గండికోట ఉత్సవాలు

జనవరి మొదటి వారంలో ప్రారంభం
సాస్కి ప్రాజెక్టు పనుల పరిశీలనలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



పర్యాటక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జిల్లా పర్యాటక, చారిత్ర, సాంస్కృతిక వైభవాన్ని దేశం నలు దిక్కులా చాటేలా గండికోట ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్‌చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం గండికోట ఉత్సవాల ఏర్పాట్లు, సాస్కి పర్యాటక అభివృద్ధి పనులను, గండికోట పర్యాటక క్షేత్రాన్ని పరిశీలించారు. ముందుగా ఆయన జిల్లా పర్యాటక శాఖ, ఎపిటిడిసి అధికారులు కాంట్రాక్టు ప్రతినిధులకు, గండికోట పర్యాటక కేంద్రం అభివృద్ధి పథకంలో భాగంగా చేపట్టే అన్ని రకాల పనులకు సంబంధించిన మ్యాపులను, డిజైన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందించారు. పనుల నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా అన్ని రకాల పర్యటన ప్రాజెక్టులను చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల్లో క్యాపిటల్ ఇన్‌వెస్ట్‌మెంట్ కోసం ప్రత్యేక సహకారం (సాస్కీ) అందించే పథకం ద్వారా గండికోట పర్యాటక కేంద్రంలో సుసంపన్నమైన కోట, గార్జ్ అనుభవాన్ని పర్యాటకుల సొంతం చేసే దిశగా జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. జనవరి మొదటి వారంలో ప్రారంభం కానున్న గండికోట ఉత్సవాలను జిల్లా పర్యాటక, చారిత్ర, సాంస్కృతిక వైభవాన్ని దేశం నలుమూలలా విస్తరింపజేసేలా కొన్ని ప్రధానమైన పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలకు మునుపే పూర్తి కావాల్సిన పలు ముఖ్యమైన పనులను పరిశీలించి ఎంట్రన్స్, వెలివేషన్, పార్కింగ్, అమినిటీ భవనం త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిటిడిసి ఇంజనీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌లను ఆదేశించారు. ఎపి టూరిజం కార్పొరేషన్‌తో ఎపిలోఅమలు చేస్తున్న టూరిజం పాలసీలో భాగంగా పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పిస్తున్నామన్నారు. గండికోట ప్రాంతాన్ని సాస్కీ పథకం ద్వారా రూ.79 కోట్లతో అభివృద్ధి చేసి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. అందులో భాగంగానే పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. టెంట్ సిటీ, 1.5 కిలో మీటరు మేరా గండికోట ఫోర్టు నుండి విజిటర్స్ సెంటర్ వరకు వాకింట్ ట్రెయల్‌ను నిర్మిస్తున్నామని, ఈ మార్గం మొత్తం కూడా వెహికల్ ఫ్రీ జోన్ గా కేటాయించి ఈ మార్గానికి ఇరువైపులా పర్యాటకులు చక్కటి ఆహ్లాదకరమైన అనుభూతిని పొందేలా పలు ప్రత్యేక నిర్మాణాలను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రాండ్ కాన్యన్‌ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ సదుపాయం కూడా కల్పించే సందుపాయం కల్పించే పనులకు ప్రాజెక్టులను సిద్ధం చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ టూరిజం సర్వీసులు కూడా అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, ఏపీ టిడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, పిఆర్ ఎస్‌ఇ మద్దన్న, హౌసింగ్ పీడీ రాజరత్నం, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ భాస్కర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ గోపీనాథ్, సైట్ ఇంజినీర్ విజయ్, ఆర్కిటెక్చర్ డిజైనర్లు ఇర్ఫాన్, అబ్దుల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి యువ క్రికెటర్ సాద్ ఇర్ఫాన్

రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గుంటూరులో గత నెల 29 నుండి ఈనెల 1వ తేదీ వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో ప్రొద్దుటూరు యువ క్రికెటర్ సాద్ ఇర్ఫాన్ మరోసారి ఔరా అనిపించాడు. ప్రొద్దుటూరులోని గౌతమ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సాద్ ఇర్ఫాన్ వరుసగా రెండోసారి జాతీయ స్థాయిలో ఆడే అవకాశం సాధించడం గర్వకారణం. ప్రతిభ చూపడంతో నేషనల్ టీమ్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు కూడా దక్కించుకున్నాడు. ఓపెనింగ్ బ్యాట్స్ మెన్‌గా దిగిన సాద్ టోర్నమెంట్‌లో 135 స్ట్రిక్ రేట్‌తో, 125 పరుగుల సగటుతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సాద్ ఆడిన ఎక్కువ మ్యాచ్‌ల్లో నాట్ అవుట్‌గా నిలిచి టీంను విజయం వైపు నడిపించాడు. బ్యాటింగ్‌తో పాటుగా బౌలింగ్‌లో కూడా సాద్ తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. 4 వికెట్లు తీసి, ఓవర్‌కు 3.8 ఎకానమీ రేట్‌తో ప్రత్యర్థుల స్కోరును అడ్డుకున్నాడు. సాద్ ఆడుతున్న టెక్నికల్ గేమ్‌ను రాహుల్ ద్రావిడ్, సంజయ్ మంజ్రేకర్ ఆటను గుర్తు చేస్తుందని కోచింగ్ స్టాఫ్, నిర్వాహకులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. బెస్ట్ బ్యాట్స్‌మన్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును కూడా సాద్ అందుకున్నాడు. ప్రొద్దుటూరులోని బిఎస్ అకాడమీ కోచ్‌లు సయ్యద్ అహ్మద్, సయ్యద్ నస్రు పర్యవేక్షణలో రోజుకు 8 గంటల కఠిన శిక్షణ పొందుతున్నాడు. సాద్ ఇర్ఫాన్ తండ్రి ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా, తల్లి మోనా అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. వచ్చే ఏడాదిలో రాజస్థాన్‌లో జరుగనున్న నేషనల్స్‌లో కూడా సాద్ రాణిస్తే ఎస్‌జీఎఫ్ ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడే అవకాశం ఉంటుందని కోచ్‌లు తెలిపారు. సాద్ చెల్లెలు సారా ఇర్ఫాన్ కూడా ఇటీవల కాలంలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో జిల్లా స్థాయిలో 6 పతకాలు సాధించింది. స్టైలిష్ ప్లే స్టైల్, ఒత్తిడిలోనూ ఆత్మవిశ్వాసంతో కొనసాగించే తీరు, జట్టును ముందుండి నడిపే నాయకత్వ లక్షణాలు కలిగిన సాద్ ఇర్ఫాన్‌ను స్థానికులు ప్రొద్దుటూరు యువ రత్నం, కడప వాల్‌గా ప్రశంసిస్తున్నారు. క్రీడాభిమానులు సాద్ ఇర్ఫాన్ భవిష్యత్ మరింత వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నారు. తన ఆటతో అంచెలంచెలుగా ఎదుగుతున్న సాద్ ఇర్ఫాన్ టీం ఇండియాలో ఆడి ప్రొద్దుటూరుకు మంచి పేరు తీసుకురావాలని అందరూ కోరుకుంటున్నారు.



మెమోంటోను అందుకున్న సాద్ ఇర్ఫాన్, కోచ్‌తో క్రీడాకారుడు

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప



129 పరుగులు చేసిన రాజ్

ఎసిఎ అండర్ - 14 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, సౌత్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్ లో సౌత్ జోన్ విన్నర్స్ జట్టు 76.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని మొహమ్మద్ ఇజ్వార్ 91 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని నాగ వెంకట జత్విక్ నాలుగు, ఉనయిస్ మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 78.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 303 పరుగులు చేసింది. ఆ జట్టులోని రాజ్ 129 పరుగులు (సెంచరీ) చేశాడు. సౌత్ జోన్ విన్నర్స్ జట్టులోని తరుణ్ కుమార్‌రెడ్డి 3, రక్షణ సాయి 2, జస్వంత్ 2 వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు ఆధిక్యత సాధించింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నార్త్ జోన్ విన్నర్స్, సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్ విన్నర్స్ జట్టు 272 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 90.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. ఆ జట్టులోని తమన్ సాయి 111 పరుగులు సెం చరీ చేసి నాటౌట్‌గా నిలిచాడు. రితీష్ 58 పరుగులు చేశా డు. నార్త్ జోన్ విన్నర్స్ జట్టులోని లోహిత్ రెండు, రుత్విక్ రెండు వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు ఆధిక్యత సాధించింది. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 181 పరుగులు చేసింది. రెండు వికెట్ల నష్టానికి 62 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 63.5 ఓవర్లలో 197 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మీహిర్ తేజ్ 42, విగ్నేష్ 31 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని రోహిత్ అద్భుతంగా బోలింగ్ ప్రదర్శించి ఆరు వికెట్లు తీసుకున్నాడు. ముని జ్ఞానేశ్వర్ 2, హేమంత్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఆ జట్టులోని హేమచంద్ర నాయక్ 70, సాయి కృష్ణ చైతన్య 23 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని దీక్షిత్ 3, రతన్ 3 వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు ఆధిక్యత సాధించింది.

మున్సిపల్ వాహనాలకు
ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలి

- రవాణాశాఖాధికారికి సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి - బద్వేలు

మున్సిపల్ వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని సిఐటియు పట్టణ కమిటీ సభ్యులు పి. చాంద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన పురపాలక సంఘంలో చెత్త తరలించే వాహనాలకు ఫిట్నెస్ పరీక్షలు, ఇన్సూరెన్సులు చేయడానికి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు పురపాలక సంఘం పరిధిలో వ్యర్థాలను తరలించే వాహనాలకు ఫిట్‌నెస్ లేకపోతే ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. పారిశుధ్య కార్మికులందరూ అధిక శాతం ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన నిరుపేదలన్నారు. వారు కూడా వాహనాలు సక్రమంగా లేకపోతే అవస్థలు పడుతుంటారని పేర్కొన్నారు.చెత్త తరలించే వాహనాలకు బ్రేకులు,క్లచ్చులు సరిగా పనిచేయక, ఇంజన్, గేరు,లి ఫ్ట ఆయిల్స్ సరైన మోతాదులో లేక, ఫిల్టర్స్ మార్పు చేయక, సెల్ఫ్ మోటార్స్ పనిచేయక, సిగ్నల్ లైట్లు, హెడ్లైట్లు లేక, టాపులు లేక, ట్రాలీలు తృప్పు పట్టిపోవడం, ఇన్సూరెన్స్‌లు లేకపోవడం వంటి సమస్యలు అనేకం ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, ఉపాధ్యక్షులు పత్తూరు యువరాజు, సహాయ కార్యదర్శులు సోమేశుల నరసింహ, చాపల్లి సుధాకర్ పాల్గొన్నారు.



రవాణాశాఖాధికారికి వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

లింగ నిర్ధారణ పరీక్షల నివారణలో
అధికారులు విఫలం

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో ప్రయివేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని, వాటిపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవడంలో వైద్యఆరోగ్యశాఖాఅధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు, కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల వంటి ప్రాంతాలలో విచ్చలవిడిగా ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధమని ఒక వైపు ప్రభుత్వం చెబుతున్నా, ప్రయివేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు సామాన్య ప్రజల బలహీనతను అవసరాలను అవకాశంగా చూసుకుని చట్ట విరుద్ధంగా నడుచుకుంటున్నాయని అన్నారు. మళ్లీ అదే ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని పోస్టర్లు వెలిసి ఉంటాయని తెలిపారు. ఇదో విచిత్రమని అన్నారు. ఆసుపత్రులలో చట్ట విరుద్ధమైన అబార్షన్లు కూడా చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కళ్ళున్నా చూడలేని గుడ్డివాళ్లలాగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లా లో ఎన్ని ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్ల, ఆర్‌ఎంపి సెంటర్లు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నారో ఎవ్వరికి తెలియని సంగతి అన్నారు. ఎక్కడో ఒక చోట సంఘటనలు జరిగితే తప్ప చర్యలు, తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రయివేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నిర్మల్, రాజు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని నగర అధ్యక్షులు జల సుమంత్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రకాష్ నగర్ బాలుర సంక్షేమ హాస్టల్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 25వ మహాసభలు తిరుపతి నగరంలో ఈ నెల 12, 13, 14 తేదీలలో నిర్వహిస్తున్నమన్నారు. 12న ర్యాలీ, బహిరంగ సభ ఇందిర మైదానంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వేలాదిగా విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 500 మంది ఎంపిక చేయబడిన ప్రతినిధులు పాల్గొని రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై, రాష్ట్ర విద్యారంగా అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేస్తామని అన్నారు. రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులతో పాటు అఖిలభారత నాయకత్వం, విద్యా, మేధావులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కడప నగర ఉపాధ్యక్షులు అఖిలేష్, నవీన్,కార్తీక్, నగర కమిటీ సభ్యులు మనోహర్, అభిలేష్, సాగర్, రాజేష్, ఓంకార్, నరసింహ, కార్తీక్ పాల్గొన్నారు.

5న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని 152 జూనియర్ కళాశాలలో ఈ నెల 5న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మెగా పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్‌జెడి టి.ఎస్.వి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు విద్యార్థులకు సమగ్ర ప్రగతి నివేదికలు పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు అందరు పాల్గొని మెగా పేరెంట్, టీచర్స్ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

వాలీబాల్ గేమ్స్‌లో వైద్య విద్యార్థికి మూడో స్థానం

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రభుత్వ వైద్య కళాశాల కడప విద్యార్థులు 27వ ఇంటర్ కళాశాల గేమ్స్‌లో పాల్గొని వాలీబాల్ విభాగంలో మూడో స్థానం సాధించారు. ఈ పోటీలు జిఎస్ఎల్ రాజమండ్రిలో నిర్వహించారు. విద్యార్థిని ప్రిన్సిపల్ డాక్టర్ టి. జమున, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. నాగ శ్రీలత, కళ్యాణి, అలాగే స్పోర్ట్స్ కమిటీ సభ్యులు వై. శ్రీనివాసులు, ఎం. సహీబ్, ఈశ్వర్ చందర్, దినేష్, ఎస్.వి. సుబ్బారావు అభినందించారు.

పిల్లలకు పౌష్టికాహారం అవసరం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం ఎర్రమాసుపల్లె రోడ్డు కృష్ణాపురం అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. అనంతరం పిల్లల బరువును,ఎత్తులను పరిశీలించారు. జీరో టు ఫైవ్ ఇయర్స్ అనేది పిల్లల జీవితంలో చాలా ముఖ్యమైందని తెలిపారు. పోషణపై పిల్లల తల్లులకు వివరించారు. ప్రతి నెలా అంగన్వాడీ సెంటర్‌కు వచ్చి పిల్లల బరువును, ఎత్తును చూసుకొని వారు ఏ స్థితిలో ఉన్నారో అంగన్వాడీ వర్కర్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి దేవి, వర్కర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

జాతీయ వెబినార్ విజయవంతం

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపతి) కడపలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ఇండియా మ్యూచువల్ ఫండ్స్ సంఘం (ఎఎంఎఫ్ఐ)సహకారంతో 'ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఏ లైఫ్ స్కిల్ అండర్ ఎన్‌ఈపి 2020' అనే అంశంపై ఒకరోజు జాతీయ వెబినార్ విజయవంతంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ జి. రవీంద్రనాథ్ అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపల్ ఎం. రమేష్ సహాధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ వెబినార్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, నేటి ప్రపంచంలో ఆర్థిక జ్ఞానం ఒక అత్యంత ముఖ్యమైన జీవన నైపుణ్యంగా మారిందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు స్మార్ట్ ఫైనాన్షియల్ నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వెబినార్ కన్వీనర్ ఎ. నాగరాజు, ఐక్యూఎస్‌సి కో- ఆర్డినేటర్ డాక్టర్ సురేష్ బాబు అధ్యాపకులు డాక్టర్ మధుసూదన, డాక్టర్ నీలయ్య, డాక్టర్ కృష్ణవేణి, రెడ్డిబాష, శివరాం, రాజశేఖర్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

21న విశాఖలో బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న నిర్వాహకులు

విశాఖపట్నంలో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు (ప్రో్ప్రవీణ్) న్యూ ఆంధ్రబాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించనున్నట్లు కడప జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు యం.తారీఖ్ అలీ, కార్యదర్శి అన్సర్ అలీ పేర్కొన్నారు. మంగళవారం కూన్ ఖా రిస్తా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ కాంపిటీషన్‌కు ప్రతి ఒక్కరూ రావాలని కోరారు. సమావేశంలో స్టేట్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్. న్యామతుల్లా, ట్రెజరర్ ఇంతియాజ్ ఖాన్, ఫిరోజ్ ఖాన్, రాజా, ఏజాస్ ఖాన్, మోయిన్, ముక్తియర్ ఉమర్, సలీం, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఆయనో ఇంజినీరింగ్ ట్రబుల్ షూటర్

- తెలుగుగంగ ఎస్ఇ ఉద్యోగ విరమణ సమావేశంలో పలువురు వక్తలు
- జిల్లా ప్రజల రుణం తీర్చుకోలేనిది : ఎస్ఇ



వెంకటరామయ్య దంపతులను సన్మానిస్తున్న అతిథులు, సిబ్బంది

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్, తెలుగుగంగ, మైనర్, రెగ్యులర్ ఇరిగేషన్ విభాగాల్లో తలెత్తే సమస్యల పరిష్కర్తగా, ట్రబుల్ షూటర్‌గా తెలుగుగంగ సూపరింటెండెంట్ ఇంజినీర్ డి.వెంకటరామయ్య నిలిచారని ఇంజినీరింగ్ సిఇ ఎంఎల్ఎన్ వరప్రసాద్, జిఎన్ ఎస్ఎస్ ఎస్ఇ కొండారెడ్డి, ఇరిగేషన్ రెగ్యులర్ సర్కిల్ ఎస్ఇ అబ్దు షమీ, ధనుంజయులు కొనియాడారు. కడప నగరంలోని బిఎంఆర్ కల్యాణ మండపంలో ఉద్యోగ విరమణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కడప ఇరిగేషన్ ఇన్‌ఛార్జి సిఇ ఎం ఎల్ఎన్ వరప్రసాద్ మాట్లాడుతూ కడప జిల్లా ఇంజినీర్లలో తెలుగు గంగ ఎస్ఇ చొరవ, ధైర్యం, అనుభవం కలగలిసిన ఇంజినీరింగ్ నిపుణత అబ్బురమన్నారు. కడప జిల్లా నుంచి విజయవాడకు సిఇలు ఎవరొచ్చినా వెంకటరామయ్య తప్పనిసరిగా ఉండడం గమనించానని తెలిపారు. ప్రస్తుతం తెలుగుగంగ విభాగాల్లో గెస్ట్‌హౌస్ ఆధునీకరణకు తీసుకున్న చొరవను ప్రశంసించారు. అనంతరం జిఎన్ఎస్ఎస్ ఎస్ఇ కొండారెడ్డి మాట్లాడుతూ బద్వేల్ ఇరిగేషన్ విభాగంలోని పోరుమామిళ్లలో ఉద్యోగంలో చేరిన ప్పటి నుంచి ఇంజి నీరింగ్ మెళకువల్లో ముందు వరుసలో నిలిచేవాడన్నారు. ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ అబ్దుషమీ మాట్లాడుతూ ఎస్ఇ అనంతపురం జెఎన్‌టి యులో సహ విద్యార్థి అని, ఆయన మెకానికల్ ఇంజినీరింగ్, తాము సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులుగా విద్యాభ్యాసం చేశామన్నారు. మెకా నికల్ ఇంజినీర్, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 38 సంవత్సరాలు రాణించడం మాటలు కాదన్నారు.అనంతరం నెల్లూరు జిల్లాలో క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్ ధనుంజయులు మాట్లాడుతూ తెలుగుగంగ ఎస్ఇ వెంకటరామయ్యతో సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. పులివెందుల ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన ఇంజినీరింగ్ జీవితంలో గురుతుల్యులుగా నిలిచారని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యు.రమేష్ మాట్లాడుతూ మైనర్, రెగ్యులర్ ఇంజి నీరింగ్ విభాగాల్లో రాజకీయ జోక్యాల నేపథ్యంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడానికి ఎవరూ ముందుకు రారని తెలిపారు. జిల్లా రాజకీయ నాయకుల నుంచి కలెక్టర్లు, ఇరిగేషన్ కార్యదర్శులను మేనరిజం చేయడం తెలిసిన ఇంజినీర్‌గా నిలిచిపోయారని కొనియాడారు. హెచ్ఎన్ఎస్ ఇఇ విఠల్‌ప్రసాద్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పరిధిలోని హెచ్ఎన్ఎస్ఎస్ పనుల వివరాలను కలెక్టర్లకు సమర్థవంతంగా వివరించడం ఆయనకే చెల్లిందన్నారు. డిప్యూటీ ఇంజినీర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎఇ నాగేం ద్ర నాయక్ మాట్లాడుతూ ఎస్ఇ నుంచి ఎన్నో మెళకువలు నేర్చు కున్నామని తెలిపారు. టిడిపి జిల్లా నాయకులు హరిప్రసాద్, మరో కాంట్రాక్టర్ మాట్లాడుతూ జిల్లా ఇంజినీరింగ్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఇటు వంటి అరుదైన ఇంజినీర్‌కు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చివరన ఎస్ఇ వెంకటరామయ్య మాట్లాడుతూ కడప జిల్లా ప్రజలు మంచివారని, వారితో కలిసిపోయి ముందుకు సాగితే రాజకీయ, ఉన్నతాధికారుల మన్ననలు దక్కుతాయన్నారు. ఇది తన ఉద్యోగ జీవితంలో లభించిన అనుభవంతో చెబుతున్నానని, కడప ప్రజల రుణం తీర్చుకోలేదన్నారు. అనంతరం ఇరిగేషన్ ఇంజినీర్లు, సిబ్బంది ఎస్ఇ దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో జిల్లాలోని ఆరు ఇరిగేషన్ సర్కిల్స్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, రాజకీయ విభాగాలకు చెందిన పలువురు హాజరయ్యారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు

బాలోత్సవంలో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాల (మరియాపురం)లో గత నెల 29, 30 తేదీల్లో గుర్రాల గోపాలరావు (మాజీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ చైర్మన్) అధ్యక్షతన నిర్వహించిన కడప బాలోత్సవం కార్యక్రమంలో బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థల విద్యార్థులు తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు. వివిధ విభాగాల్లో పాల్గొన్న విద్యార్థులు అత్యధిక విజయాలను సాధించి, బీరం విద్యాసంస్థల పేరును జిల్లాలో ఘనంగా ప్రతిధ్వనింపజేశారు. బాలోత్సవం పోటీల్లో బీరం విద్యాసంస్థల నుండి 60 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 45 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరికి నిర్వాహకులు సర్టిఫికెట్లు, మోడల్స్, షీల్డులను అందజేశారు. ఈ సందర్భంగా బీరం విద్యాసంస్థల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేతా విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

'శ్రీచైతన్య' విద్యార్థుల ఘన విజయం

ప్రజాశక్తి - వేంపల్లె

కడప మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాల వేదికగా గతనెల 29, 30 తేదీల్లో నిర్వహించిన జిల్లాస్థాయి బాలోత్సవం-25 పోటీల్లో స్థానిక శ్రీచైతన్య విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ఆ విద్యార్థులను చక్రపాణిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు అకడమిక్, సాంస్కృతిక విభాగాల్లో తమ ప్రతిభను చాటుకొని పలు విభాగాల్లో మెరిసి పతకాలను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. తమ పాఠశాల నుండి 120 మంది విద్యార్థులు 24 విభాగాల్లో పోటీ చేసినట్లు చెప్పారు. వారిలో 20 విభాగాల్లో అద్భుత విజయాలు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

జాతీయ స్థాయి పోటీలకు 'నరహరిపురం' విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన ఘట్కా మార్షల్-ఆర్ట్స్ రాష్ట్రస్థాయి పోటీలో మండల పరిధిలోని నరహరిపురం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహ శాస్త్రి తెలిపారు. అండర్ 1/17 విభాగంలో జ్ఞాన అక్షిత సాయి, శుభ లక్ష్మి, అండర్ 1/19 విభాగంలో ప్రణవి కాంస్య పతకం సాధించారని తెలిపారు. వీరిలో జ్ఞాన అక్షిత సాయి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో జరగబోయే జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. తమ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు, పీడీ ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉర్దూ విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రసాద్

రాష్ట్రస్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో అండర్-14 క్రీడా పోటీలకు వేంపల్లె ప్రభుత్వ ఉర్దూ పాఠశాల విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. బాలుర విభాగంలో 8వ తరగ మన్సూర్, బాలికల విభాగంలో బిందు మాధవి మూడవ స్థానంలో.. అండర్-17లో పదవ తరగతి నూరుల్లా రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించారని పేర్కొన్నారు. వీరిని మంగళవారం పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, పీడీలు షాహిన్, సివిఎస్ రాయుడు అభినందించారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు.

పాఠశాల అభివృద్ధికి విశేష కృషి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రధానోపాధ్యాయులు రామాంజనేయ రెడ్డి స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని ఎంఇఒ శివప్రసాద్ పేర్కొన్నారు. ఆ పాఠశాలలో ఎం ఇఒ-2, ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ శివప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో రామాంజనేయరెడ్డి పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేసి సుమారు రూ.16 లక్షలతో పనులు చేయించారని ప్రశంసించారు. ఆయన హయాంలో విద్యార్థులు మంచి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణత సాధించారని కొనియాడారు. జెడ్పిటిసి బాలయ్య మాట్లాడుతూ హెచ్‌ఎం విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టడంలో ఎంతో కృషి చేశారని అన్నారు. హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రిటైర్డ్ హెచ్‌ఎంలు, ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు ఎస్‌ఎం బాషా, రఘురామిరెడ్డి, మోహన్‌రెడ్డి, నేతాజీ బాషా, రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రామాంజనేయరెడ్డిని సన్మానిస్తున్న జడ్‌పిటిసి బాలయ్య, ఎంఇఒ

ఎయిడ్స్ వ్యాధి నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలను చైతన్యం కల్పించేందుకు మంగళవారం ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ ప్రభుత్వ డిగ్రీ ఆవరణలో రెడ్ రిబ్బన్ క్లబ్ అండ్ యూత్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోస్టర్, పెయింటింగ్ ప్రజెంటేషన్, రంగోలి పోటీలు చేపట్టారు. వేంపల్లె ప్రధాన రహదారి గుండా నాలుగు రోడ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ నాగలక్ష్మిదేవి, డాక్టర్ రామకృష్ణ, అరవింద్, షఫీవుద్దీన్, డాక్టర్ మాధవరావు, రాజారెడ్డి, రేష్మ, పీడీ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీతో ఉల్లి గోదాములు

ప్రజాశక్తి - చాపాడు

ఉల్లి రైతులు తమ దిగుబడిని గిట్టుబాటు ధర వచ్చే వరకూ నిల్వ ఉంచుకునేందుకు ప్రభుత్వం రాయితీతో గోదాములు నిర్మించుకునే అవకాశం కల్పించింది. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 50శాతం రాయితీతో ఉల్లి గోదాముల ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. 25 టన్నుల ఉల్లిగడ్డలను నిల్వ ఉంచుకునేలా గోదాములను నిర్మించుకునుందుకు రూ.1.75 లక్షలు మంజూరు చేస్తుంది. ఇందులో రైతు వాటాగా రూ.87,500 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం మైదుకూరు నియోజకవర్గం పరిధిలో 2వేల ఎకరాలలో కేపీ ఉల్లి సాగులో ఉంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వీటి దిగుబడి రానుంది. రైతులు గోదాములను ఏర్పాటు చేసుకుంటే గిట్టుబాటు ధర ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. పూర్తి వివరాల కోసం సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు. మార్కెట్లో ఉల్లి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లిగడ్డలను పారవేయడం, వ్యాపారులు అడిగిన ధరలకు ఇవ్వాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉంది. గిట్టుబాటు ధర కోసం ఉల్లిని నిల్వ చేసుకునే సౌకర్యంలేక రైతులు నష్టాలకు అమ్ముకునేవారు. రాయితీతో ప్రభుత్వం ఉల్లి నిల్వ గోదాములు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం హర్షణీయం.



ఉల్లిగడ్డలను నిల్వ చేసుకునే గోదాములు

పులివెందుల సంక్షేమ హాస్టళ్లు ఆదర్శం కావాలి



వార్డెన్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల సంక్షేమ హాస్టళ్లు రాష్ట్రానికి ఆదర్శం కావాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సూచించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల వార్డె లతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ హాస్టళ్లలో జరుగుతున్న తప్పులు సరిదిద్దుకోవాలన్నారు. విద్యార్థుల సంక్షేమ విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేశారు. అన్ని హాస్టళ్లలో ఉన్న సమస్యలను వార్డెన్‌ల నుండి ప్రత్యక్షంగా తెలుసుకుని, వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులను కోరారు. కార్యక్రమంలో పులివెందుల పరిధిలోని హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం ఎస్‌టియు జిల్లా శాఖ అధ్యక్షులు సంగమేశ్వర్‌రెడ్డి, పులివెందుల, వేంపల్లి రీజియన్ నాయకులు ఆయనను కలిశారు. ఈనెల 13, 14తేదీల్లో కడప నగరంలో నిర్వహించనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు, విద్యా సదస్సు కార్యక్రమాలకు రావాలని ఎమ్మెల్సీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. మూల్యాంకన విధానం, ప్రశ్న పత్రాల రూపకల్పన లోపభూయిష్టంగా ఉందని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరం ఈ విధానాన్ని రద్దు చేయాలని సూచించారు. ఎస్‌ఎస్‌సి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక సెలవు రోజుల్లో మినహాయించేలా మంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు బండి సుధాకర్‌రెడ్డి, ఎస్ దాదాపీర్, అంగడి నాగేంద్ర, మహేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, ఆలీ మునిబాబు, జనార్దన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు చేయూతనివ్వాలి

25 ఏళ్లుగా పునరావాస కేంద్రం నిర్వహణ : అల్‌షిఫా వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ



కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో అల్‌షిఫా వ్యవస్థాపకులు రఫీ, విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మానసిక వికలాంగుల్లో మార్పు రావాలంటే వారికి కావాల్సింది జాలి, దయా, కరుణ కాదని చేయూత ముఖ్యమని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మానసిక వికలాంగులకు చేయూతనిస్తే వారు సకలాంగులకు ఏ విధంగా తక్కువ కారని చెప్పారు. చైతన్యవంతులను చేయడానికి ఆటల పోటీలు న్విహిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక ఒలంపిక్‌లో పాల్గొనేలా చేసి కేవలం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయి పోటీలకు తీసుకుని వెళ్లామని పేర్కొన్నారు. ఆల్‌షిఫా మానసిక పునరావాస కేంద్రాన్ని 2000 సంవత్సరంలో ప్రారంభించామని తెలిపారు. నిస్వార్థంతో మానసిక వికలాంగులకు సేవ చేస్తున్నామని చెప్పారు. మానసిక దివ్యాంగ పిల్లలకు పెన్షన్ మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇంట్లో ఇద్దరు మానసిక వికలంగుల పిల్లలు ఉంటే ఒకరికి మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని, ఇద్దరికి ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. తల్లిదండ్రుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల పిల్లలకు, ప్రయివేట్ రంగ సంస్థలో, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిక్‌లో పనిచేస్తున్న వ్యక్తుల మానసిక వికలాంగుల పిల్లలకు పెన్షన్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఐక్యూ 10శాతం కంటే తక్కువ ఉన్న పిల్లలకు రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. సొంత గృహాలను కట్టించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, షూ ఇస్తున్నారని, వీరికీ ఇవ్వాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వ ఆధీనంలో ఒక పునరావాల కేంద్రాన్ని మానసిక వికలాంగుల కోసం ఏర్పాటు చేయాలని కోరారు. తమ పునరావాస కేంద్రంలో శిక్షణ తీసుకున్న బాల, బాలికలు, వివిధ మండలాలలో పనులను చేసుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలబడుతున్నారని పేర్కొన్నారు. 2016 ఏడాది చట్టాన్ని అనుసరిస్తూ కడపలో ఉన్న సహాయ సంచాలకులు వికలాంగుల శాఖ వారు బ్యాక్‌లాగ్ పోస్టులను ఇచ్చినప్పుడు వాటిలో 4 పోస్టులు మానసిక వికలంగులకు ఇచ్చారని తెలిపారు. అందులో ఒకపిల్లవాడు తమ పునరావాస కేంద్రానికి చెందిన వ్యక్తి కావడం గర్వంగా ఉందని చెప్పారు. ఈ నెల 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహిస్తామని రఫీ పేర్కొనారు.



ఎడి కృష్ణకిషోర్‌తో రఫీ, విద్యార్థులు(ఇన్‌సెట్‌లో) వ్యవస్థాపకులు రఫీ

గ్రామ కమిటీలతోనే పార్టీ అభివృద్ధి : ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి (ఇన్‌సెట్) పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

గ్రామ కమిటీలతోనే పార్టీ అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మైదుకూరు పట్టణంలోని ఎస్‌సిసిఆర్ కల్యాణమండపంలో మంగళవారం గ్రామ, మున్సిపల్ వార్డు కమిటీల నియామక అవగాహన సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ మాట్లాడుతూ గతంలో వైసిపి అధికారంలోకి రావడానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖరరెడ్డి వేసిన పునాదులు కారణమన్నారు. తర్వాత వైఎస్ జగన్ సుపరి పాలనను అందించారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. 18నెలల్లో ఫీజు రీయిం బర్స్మెంట్ ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. గ్రామ అనుబంధ విభాగాలు కమిటీలను చిత్తశుద్ధితో ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ కోసం కష్ట పడిన వారినే కమిటీల్లో ఉండేలా చూడాలన్నారు. ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ బంధు ప్రీతికి అవకాశం లేకుండా పార్టీకి కష్టపడిన వారినే నియమించాలన్నారు. రాబోయే రోజుల్లో గ్రామ కమిటీల ఆమోదంతోనే పార్టీ పదవులు అందుతాయన్నారు. అనంతరం పార్లమెంటు పార్టీ పరి శీల కులు వజ్రా భాస్కర్ రెడ్డి కమిటీల నియామకం పట్ల అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఆర్‌వి సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, శివరాం, రాఘవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సంబ టూ రు ప్రసాద్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శాంతరాజు, మదీనా దస్తగిరి, జ్వాలా, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో ప్రతిభావంతులకు పెద్దపీట : మాజీ ఎమ్మెల్యే

ఖాజీపేట : వైసిపిలో ప్రతిభావంతులకు అధిష్టానం పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఎస్.రఘురామిరెడ్డిని మంగళవారం అధికార భాష సంఘం పూర్వ సభ్యులు, రాయలసీమ కథా సాహిత్య పరిశోధకులు డాక్టర్ తవ్వా వెంకటయ్యను పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన సందర్భంగా ఆచార్య మూల మల్లి కార్జునరెడ్డితో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్లు సి.నాగూర్, బైరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గూడెం చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రొద్దుటూరుకు చెందిన గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే అనారోగ్యాలు దరిచేరవన్నారు. ఎక్కడైతే అపరిశుభ్రత ఉంటుందో అక్కడ అనారోగ్యంతో కూడుకున్న వ్యక్తులు ఉంటారన్నారు. విద్యార్థులు మన ఇంటిలో పరిశుభ్రతను ఎలా కలిగి ఉంటామో బయట ప్రాంతంలో అలాగే ఉండాలన్నారు. ముఖ్యంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం శుభ పరిణామమన్నారు. అనంతరం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత కల్పవల్లి మాట్లాడుతూ గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ద్వారా తమ పాఠశాలలో పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు స్వరూప్, శ్రీనివాసులు, సింధూజ, ఉపాధ్యాయులు గురుకుమార్, శర్మ, రామయ్య, శంకర్‌రెడ్డి, విద్యాసాగర్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డైరెక్టర్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

యోగా అలవాటు చేసుకోవాలి

వేంపల్లె : ప్రాథమిక దశ నుండే విద్యార్థులు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని ప్రోగ్రాం ఆఫీసర్ కోటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని మారుతి నగర్ ప్రాథమిక పాఠశాలలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు డ్రాయింగ్, ఆటలు పోటీలు నిర్వహించారు. బాలికలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల హెడ్ మాస్టర్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొ న్నారు.

రెండు ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు మంజూరు

చాపాడు : మండలానికి రెండు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు మంజూరైనట్లు ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. తాత్కాలిక ప్రతిపాదికన అన్నవరం జడ్‌పి హైస్కూల్‌లో సోషల్, చాపాడు ఉర్దూ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ పోస్టులున్నాయన్నారు. ఐదు నెలల కాల పరిమితి ఉంటుందన్నారు. నెలకు వేతనం రూ.12,500 అని తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో బిఇడి పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

శ్మశానాల అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మార్చి నాటికి 61శ్మశానాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మైదుకూరు మండలం ధాంఖాన్‌పల్లె శ్మశాన వాటికలో రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గ పరిధిలో శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొన్ని శ్మశానాలకు దారుల్లేక ప్రజల అవస్థలు పడుతున్నారన్నారు. బ్రహ్మంగారి మఠంలో 13, చాపాడులో11, దువ్వూరులో9, ఖాజీపేటలో 15, మైదుకూరులో 13 మొత్తం 61 శ్మశానాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా శ్మశాన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో మొత్తం 600 శ్మశానాలను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్నామన్నారు. నాగిరెడ్డిపల్లె శ్మశానం దారి ఆక్రమించారని మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కారించాలని ఎమ్మెల్యే తహశీల్దార్ రాజసింహ నరేంద్రకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఏపీడి మైథిలి, ఉపాధి ఏపీఓ రామచంద్రారెడ్డి, ఎంపీపీ థామస్, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు భీమయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి, గ్రామ టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



భూమి పూజలో నంద్యాల కొండారెడ్డి, అధికారులు

రోడ్డు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండల పరిధిలోని తాళ్లమాపురం-రాజువారిపేట రోడ్డు నుండి సగిలిగుడ్డుపల్లెకు బిటి రోడ్డు రూ.48 లక్షల వ్యయంతో, సగిలిగుడ్డుపల్లెలో అంతర్గత సిసి రోడ్డు రూ.15 లక్షల వ్యయంతో పనులకు మంగళవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, నంద్యాల ఆనంద్ భా రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పిఆర్ డిఇ లక్ష్మీనారాయణ రెడ్డి, ఎఇ గణేష్, సిగినేని కొండారెడ్డి, కట్టమీది మోహన్‌రెడ్డి, రఘురామిరెడ్డి, రాజేష్, కట్టమీది రామకృష్ణారెడ్డి, కట్టమీది జయవర్ధన్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లిఖార్జున, తాళ్లమాపురం సర్పంచ్ కొండారెడ్డి, రామచంద్రారెడ్డి, దండు శీను, గంగిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రమేష్, సుబ్బయ్య, కల్లూరు నిరంజన్ రెడ్డి, ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



ఆశాలకు సూచనలిస్తున్న డాక్టర్ ఖాజా మొయిద్దీన్

దోమల వ్యాప్తిని నిర్మూలించాలి

ప్రజాశక్తి - వేముల

ప్రస్తుతం సీజన్‌లో దోమల వ్యాప్తి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజామొయిద్దీన్ సూచించారు. వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆశా కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆశా కార్యకర్తలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తొట్లు, నీటి డ్రమ్ములు, నీరు నిల్వ ఉంచుకొనే ఇతర పాత్రలపైన మూతలు ఉంచాలని చెప్పాలన్నారు. దోమను లార్వా దశలోనే అంతం చేయాలన్నారు. దోమ గుడ్లు సాధారణంగా నీటి ఉపరితలంపై పెడతాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శరణ్య, డాక్టర్ ఆఫ్రిన్, సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య, సిహెచ్‌ఓ అరుణ కుమారి, సీనియర్ అసిస్టెంట్ నరేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు లింగవివక్ష చూపరాదు

ప్రజాశక్తి - వేముల

ఆడ, మగ అనే లింగవివక్ష తల్లిదండ్రులు చూపరాదని వెలుగు ఎపిఎం ఆంజనేయులు సూచించారు. మంగళవారం జెండర్ కాంపెయిన్ కార్యక్రమాన్ని కొత్తపల్లె గ్రామంలో డ్వాక్రా మహిళలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ బాలబాలికల పెంపకం, చదువు విషయంలోనూ తల్లిదండ్రులు వివక్ష చూపరాదని, ఉపాధి, విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఇద్దరూ సమానమేనని భావించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ నాగేశ్వరి, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు గంగా భవాని, లత, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, డ్వాక్రా మహిళలు, డ్వాక్రా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.